క్లుప్తంగా

ఎస్టీయూ ఆవిర్భావ వేడుకలు



వేడుకల్లో ఎస్టీయూ నాయకులు

పెద్దపల్లిరూరల్: విద్యా ఉపాధ్యాయ రంగాల సమస్యల పరిష్కారానికి 76 ఏళ్లుగా ఎస్టీయూ అనేక పోరాటాలు చేస్తోందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు మేరుగు సతీశ్ అన్నారు. ఎస్టీయూ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం పెద్దపల్లిలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సంతోశ్‌కుమార్, రాజు, మాధవచారి, శ్రీకాంత్‌రెడ్డి, నల్ల రాజేందర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, సమ్మయ్య, ఆనందరావు, అంజయ్య, మల్లికార్జున్, శ్రీనివాస్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నియంత పాలన



మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

కాల్వశ్రీరాంపూర్: గతంలో ఏ సీఎం కూడా ఇలాంటి చర్యలకు పాల్పడలేదని, సీఎం కేసీఆర్ నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయని అఖిలపక్ష నాయకులు ఆరోపించారు. సీఎం మంచిర్యాల పర్యటన సందర్భంగా ముందస్తు జాగ్రత్త చర్యగా శుక్రవారం అఖిలపక్ష నాయకులను కాల్వశ్రీరాంపూర్ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్, అంబేడ్కర్ జిల్లా నాయకుడు, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మంద రాజేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మునీర్, బీజేపీ మండల అధ్యక్షుడు, సింగిల్‌విండో డైరెక్టర్ జంగ శ్రీనివాస్‌రెడ్డి, మీర్జంపేట ఎంపీటీసీ గూడెపు జనార్దన్‌రెడ్డి, నాయకులు పాల రాజేశం, మాదాసు సతీశ్, ఆరెల్లి రమేశ్, బాజీపటేల్, కలవేన గట్టయ్య, దొడ్డ రాజబాబు, రాగమల్ల సురేశ్ ఉన్నారు.

వలస కార్మికులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న అడ్వకేట్ శ్రీనివాస్‌రావు

కోల్‌సిటీ: గోదావరిఖని మార్కండేయకాలనీకి చెందిన సీనియర్ అడ్వకేట్ కూచన శ్రీనివాస్‌రావు శుక్రవారం ఒడిశా వలస కార్మికులకు అన్నదానం చేశారు. తన తండ్రి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని నీడ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సామాజిక సేవకులు ఖాజా, నీడ అధ్యక్షులు పల్లెర్ల రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలు



మాట్లాడుతున్న కార్పొరేటర్ కౌశిక లత

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్ గ్రామంలో లక్ష్మి జీవన సొసైటీ వ్యవస్థాపకులు స్వప్న నేతృత్వంలో మహిళలకు మూడు నెలల పాటు కుట్టు శిక్షణ ఇప్పించారు. ఈ మేరకు శుక్రవారం శిక్షణ పొందిన మహిళలకు కార్పొరేటర్ కౌశిక లత చేతుల మీదుగా ధ్రువపత్రాలు అందజేశారు. శిక్షకురాలు స్వప్నను అభినందించారు. సామాజిక కార్యకర్త నిమ్మరాజుల రవి, గంగాప్రసాద్, మంద శ్రీనివాస్, సంధ్య, శకుంతల ఉన్నారు.

సీపీఐ ప్రజాగర్జన సభకు తరలిరండి

సుల్తానాబాద్: కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో 11న సీపీఐ చేపట్టిన ప్రజాగర్జన బహిరంగ సభకు జిల్లా నుంచి అత్యధిక మంది తరలివచ్చి జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ పిలుపునిచ్చారు. రామగుండం నుంచి స్పెషల్ ట్రైన్ 8 గంటలకు కొత్తగూడెం బయలుదేరుతుందని, అదేవిధంగా మండలాల వారీగా బస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజా గర్జనకు సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, సంఘటిత, అసంఘటిత కార్మికులు, విద్యార్థులు, మేధావులు తరలిరావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై, ప్రజా సమస్యలపై కేంద్ర రాష్ట్ర నాయకులు మాట్లాడుతారని తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు

- లారీలు రావు, గన్నీ సంచులు లేవు
- విత్తనాలు వేసే సమయం వచ్చినా.. పూర్తికాని ధాన్యం కొనుగోళ్లు
- త్వరగా పూర్తి చేయాలని అన్నదాతల వేడుకోలు



జూలపల్లిలో ధాన్యం కుప్పల వద్ద రైతుల పడిగాపులు

జూలపల్లి: వర్షాకాలం పంట సీజన్ మొదలైనా అన్నదాతలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎదురుచూపులు తప్పడం లేదు. యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించినా లారీలు రాక, గన్నీ సంచుల కొరతతో ముందుకు సాగడం లేదు. కేంద్రంలో ధాన్యం పోసి పోసి నెలరోజులు గడిచినా.. ధాన్యం కుప్పలు అలాగే ఉన్నాయి. దీంతో వడ్ల కోసం తెచ్చిన కిరాయికి తెచ్చిన రైతులకు అద్దె తడిసి మోపెడవుతోంది. వర్షాకాలం పంట వేసే సమయం ప్రారంభమైనా తమ ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో వానాకాలం పెట్టుబడి ఎలాగని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

13 కేంద్రాల్లో ఒక్కటి కూడా పూర్తి కాలేదు

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మొత్తం 13 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. మొదట్లో మందకొడిగా సాగిన కొనుగోళ్లు నెలన్నర దాటినా పూర్తి కాకపోవడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇందులో జూలపల్లి సహకార సంఘం పరిధిలో కుమ్మరికుంట, కోనరావుపేట, పెద్దాపూర్ కొనుగోలు కేంద్రాల్లో 51,100 క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. ఇంకా 20పైనే లారీల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉండగా, లారీలు రాకపోవడంతో మూడురోజులుగా కొనుగోళ్లు నిలిచాయి. వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో పెద్దాపూర్, కాచాపూర్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 46,150 క్వింటాళ్లు సేకరించారు. ధూళికట్ట సహకార సంఘం పరిధిలో వడ్కాపూర్, కాచాపూర్, వెంకట్రావుపల్లె గ్రామాల్లో కేంద్రాల ద్వారా 81వేల క్వింటాళ్లు సేకరించగా, ఎలిగేడు సహకార సంఘం పరిధిలో చీమలపేట, నాగులపల్లె, తేలుకుంట కేంద్రాల్లో 43,430 క్వింటాళ్ల ధాన్యం సేకరించినట్లు రికార్డులు చెప్తున్నాయి. పత్తిపాక సహకార సంఘం ద్వారా అబ్బాపూర్‌లో 21వేల క్వింటాళ్లు సేకరించారు. మొత్తం 2.42లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోల్లు చేశారు. అయినా నేటికి ఇంకా ఆయా కేంద్రాల్లో ధాన్యం కుప్పలు ఉండడం, లారీల కొరత ఉండడం, వర్షాలు రానున్న తరుణంలో రైతులు భాయందోళనకు గరవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు కొనుగోళ్లు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

నెల అయినా కొంటలేరు



కొనుగోలు కేంద్రం పెట్టిన వారంరోజులకు పోసిన. ఇప్పటికీ కొనలేదు. నెలరోజులు దాటింది. పనులు చేసుకోకుండా రోజూ ఇక్కడికి వస్తున్నాను. లారీలు వస్తలేవు అంటున్నారు. విత్తనాలు పెట్టడానికి డబ్బులు లేవు.

– ఎల్కపెల్లి లక్ష్మి, రైతు, జూలపల్లి

పట్టించుకోవడం లేదు



వడ్లు తెచ్చి 40రోజులు అవుతోంది. ధాన్యం కొనుగోలు గురించి అడిగితే లారీలు వస్తలేవు కొని ఏం చేయమంటారు అని అంటున్నారు. రోజూ పనులు వదిలి కొనుగోలు కేంద్రంలో పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు లారీల కొరత తీర్చాలి.

– కట్కం మల్లయ్య, రైతు, జూలపల్లి

గన్నీ సంచులు లేవు



వడ్లు పోసి నెల దాటింది. కొనమంటే సంచులు లేవు, లారీలు రావడం లేదు అంటున్నారు. వర్షాలు పడితే నష్టం పోతాం. ఇదివరకే ఒక సారి తడిసినయ్. వానాకాలం విత్తనాలు వేసేందుకు దుక్కులు దున్నించినం. వెంటనే ధాన్యం కొని మమ్మల్ని ఆదుకోవాలి.

– కొమ్మ లింగయ్య, రైతు, జూలపల్లి

వడ్లు కొంటలేరని ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

జూలపల్లి: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి నెలరోజులు దాటినా కొనడం లేదని రైతులు శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట మందు డబ్బాలతో ఆందోళనకు దిగారు. స్థానిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో లారీలు రాక, గన్నీ సంచులు లేక మూడు రోజులుగా కొనుగోళ్లు నిలిచిపోయాయని రైతులు అసహనం వ్యక్తం చేశారు. వానాకాలం పెట్టుబడికి పైసలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమ గోస ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని వాపోయారు. కొనుగోలు కేంద్రానికి ప్రతిసారీ రేపు మాపు అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీంతో ఆవేదన చెందిన రైతులు మందు డబ్బాలతో తహసీల్దారు కార్యాలయానికి వచ్చి ఆందోళనకు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ అబూబాకర్ రైతులతో మాట్లాడి వెంటనే లారీలను తెప్పించే ఏర్పాట్లు చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. రైతులు బొంగాని శ్రీనివాస్, నాడెం పోచమల్లు, దారవేని మల్లయ్య, కొండ సత్తయ్య, బీరయ్య, రమేశ్, కనుకయ్య, ఐలయ్య ఉన్నారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

గోదావరిఖనిటౌన్: జిల్లాలో అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకొని మూసివేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఎలాంటి అనుమతి లేకుండా ఇష్టానుసారంగా అడ్మిషన్లు తీసుకొని నిబంధనలు తుంగలో తొక్కుతున్నాయని ఆరోపించారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఆర్థిక దోపిడీకి గురిచేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి పాఠశాలలపై విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిడి గోపాల్, విద్యార్థి జన సమితి రాష్ట్ర కార్యదర్శి బచ్చలి ప్రవీణ్‌కుమార్, టీబీఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాగిరి రాజేశ్, టీవీఎస్ రాష్ట్ర నాయకులు రేగుంట క్రాంతికుమార్, బీసీవీఎస్ రాష్ట్ర నాయకులు సల్మాన్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

సుల్తానాబాద్: పట్టణంలోని గౌడవీధికి చెందిన పూదరి స్వప్న–రమేశ్‌గౌడ్ దంపతుల కూతురు సుమన్య వివాహానికి కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్‌బొద్దుల అనుచరులతో చీరతో పాటు ఆర్థిక సాయం పంపించారు. పద్మశాలీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మేర్గు యాదగిరి, కేసీఆర్ సేవాదళం జిల్లా ఉపాధ్యక్షుడు బింగి రాజు, ప్రధాన కార్యదర్శి చాతళ్ల కాంతయ్య, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బొద్దుల సాయినాథ్, జిల్లా నాయకులు అమరగాని శ్రీనివాస్‌గౌడ్, పొన్నం సంపత్, ముత్యం వినోద్‌గౌడ్ పాల్గొన్నారు.

పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలి



యైటింక్లయిన్‌కాలనీ: బడిబాట ర్యాలీలో టీచర్లు



రామగుండం: బడిబాటలో ఉపాధ్యాయులు



కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్: తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలని ఎంఈవో రాజయ్య, హెచ్ఎం రమేశ్ కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు కరపత్రాలు పంపిణీ చేశారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేటుకు దీటుగా సర్కారు సకల సదుపాయాలు కల్పిస్తోందని తల్లిదండ్రులకు వివరించారు.

రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్‌లో..

యైటింక్లయిన్‌కాలనీ: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాక గ్రామంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు 8వ తేదీ నుంచి నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం పాతనకాలనీ, యైటింక్లయిన్‌కాలనీ తదితర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను చేర్పిస్తే కలిగే ప్రయోజనాల గురించి వారి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శోభన్‌రావు, ఉపాధ్యాయులు జగదీశ్వర్, శంకర్, సారయ్య, పద్మజ, జ్యోతి వాణి, రామస్వామి, సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

అబాది రామగుండంలో..

రామగుండం: అబాది రామగుండంలో శుక్రవారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు పేరెంట్స్‌కు అవగాహన కల్పించారు. బడిబాటలో ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాస్, దాసరి రఘు పాల్గొన్నారు.

ఓదెల మండలంలో..



ఓదెల: గోపరపల్లెలో..

ఓదెల: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈవో ఆరెపల్లి రాజన్న కోరారు. మండలంలోని గోపరపల్లె, కొలనూర్ గ్రామాల్లో శుక్రవారం ఇంటింటా బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలోని సౌకర్యాల గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, మల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రవాణా వ్యవస్థ బాగున్నప్పుడే ఆర్థికాభివృద్ధి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న డిపో మేనేజర్

గోదావరిఖనిటౌన్: రవాణా వ్యవస్థ బాగున్నప్పుడే ఆర్థిక అభివృద్ధి సాధ్యపడుతుందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం గోదావరిఖని బస్‌డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన విలేజ్ బస్ ఆఫీసర్స్ ప్రారంభ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే సీఎం కేసీఆర్ ధ్యేయమన్నారు. అనంతరం విలేజ్ బస్ ఆఫీసర్స్‌గా ఎన్నికైన వారికి కిట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యేను డిపో మేనేజర్ పి.మల్లేశం సన్మానించారు. డిపో సూపర్‌వైజర్లు గీతాకృష్ణ, సంధ్యారాణి, సదానందం, వలిమహమ్మద్, లింగయ్య, ఎంప్లాయిా వెల్ఫేర్ బోర్డుసభ్యులు స్వామి, ఇందిరాదేవి పాల్గొన్నారు.

గీత కార్మికులను విస్మరించిన ప్రభుత్వం



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ అన్నయ్యగౌడ్

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులకు ఇచ్చే సబ్సిడీ రుణాల్లో గీత కార్మికులను విస్మరించిందని సర్పంచుల ఫోరం ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్, గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేగోళం అబ్బయ్యగౌడ్ ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కులవృత్తులకు రూ.లక్ష పథకంలో గీత కార్మికులను చేర్చాలని కోరారు. నాయకుడు బొంగోని అనిల్‌గౌడ్ ఉన్నారు.

ప్రతిపక్ష నాయకుల ముందస్తు అరెస్ట్



పెద్దపల్లిరూరల్: గృహ నిర్బంధంలో గుజ్జుల



యైటింక్లయిన్‌కాలనీ: పోలీస్ స్టేషన్‌లో నాయకులు



కమాన్‌పూర్: రామగిరి పోలీస్ స్టేషన్‌లో..

గోదావరిఖని/కమాన్‌పూర్/ధర్మారం/జూలపల్లి/రామగుండం/పెద్దపల్లిరూరల్/పాలకుర్తి/యైటింక్లయిన్‌కాలనీ/సుల్తానాబాద్‌రూరల్/ఓదెల: సీఎం కేసీఆర్ మంచిర్యాల పర్యటన నేపథ్యంలో జిల్లాలోని పెద్దపల్లి నియోజకవర్గం, రామగుండం పారిశ్రామిక ప్రాంతం, మంథని నియోజకవర్గంలోని ప్రతిపక్షాల నాయకులను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసులు నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులతో పాటు కార్మిక సంఘాల నాయకులను అరెస్ట్ చేసి పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

'అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు'



కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న సీఐ

సుల్తానాబాద్: మంచిర్యాల జిల్లా కేంద్రానికి సీఎం కేసీఆర్ వెళుతున్న సందర్భంగా ముందస్తుగా కాంగ్రెస్, బీజేపీ నేతలను సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు అశోక్ రెడ్డి, వినీత గురువారం అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నియంత ధోరణిలో వ్యవహరిస్తోందని, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని అన్నారు. కాంగ్రెస్ నాయకులు అన్నయ్యగౌడ్, అబ్బయ్యగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కల్వల శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు చిలుక సతీశ్, కిషోర్, నోముల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నాయకులు రాజన్న, తిరుపతియాదవ్, నాగరాజు, తిరుపతి, సదయ్య ఉన్నారు.

దళితబంధు అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న వైనాల రాజు

కమాన్‌పూర్: మండలంలో దళితబంధు అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు ఆరోపించారు. మండలంలోని పేరపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంథని నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో దళితబంధు అమలు చేశారు. కానీ కమాన్‌పూర్ మండలంలో ఎందుకు అమలు చేయలేదు అని ఆయన ప్రశ్నించారు. అనంతరం గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా బొంగోని సదయ్య, ఉపాధ్యక్షుడిగా పోలుదాసరి మధునయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎరుకల శ్రీహరి, గౌరవ అధ్యక్షుడిగా ఎర్రన్న, కమిటీ సభ్యులను నియమించారు. కార్యక్రమంలో సర్పంచ్ తొగరి అన్నపూర్ణ, గాండ్ల మోహన్, రఫీక్, దాసరి గట్టయ్య, ఇరుగురాల శేఖర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు రూ.లక్ష రుణం మంజూరు చేయాలి



నిరసన తెలుపుతున్న గీత కార్మికులు

కాల్వశ్రీరాంపూర్: రాష్ట్ర సర్కారు గీత కార్మికులకు రూ.లక్ష చొప్పున రుణాలు మంజూరు చేయాలని కాల్వశ్రీరాంపూర్‌లో శుక్రవారం గీత కార్మికులు తాటిచెట్టు ఎక్కి నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శించారు. అన్ని కులాలకు రూ.లక్ష రుణాలు ఇచ్చినట్లు గీత కార్మికులకు ఇస్తామని సర్కార్ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీటీసీ పొట్యాల మొండయ్యగౌడ్, గీత కార్మికుల సంఘం నాయకులు మెట్టు రవి, శ్యాంగౌడ్, బొబ్బిలి రాజయ్య, శ్రీనివాస్, నరసయ్య, నవన్, వినయ్, సాగర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానంపై భేటీలో మజ్దూర్ యూనియన్ ప్రతినిధి



సోమనాథన్ భేటీలో శంకర్‌రావు

రామగుండం: నూతన పెన్షన్ విధానంలో చేపట్టాల్సిన మార్పుల విషయమై శుక్రవారం న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న భేటీలో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ తరఫున జనరల్ సెక్రెటరీ శంకర్‌రావు హాజరయ్యారని యూనియన్ సికింద్రాబాద్ డివిజనల్ ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి రవీందర్ తెలిపారు. ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పక్షాన నేషనల్ జాయింట్ కమిటీ ఆఫ్ యాక్షన్ (ఎన్‌జేసీఏ) కన్వీనర్ శివగోపాల్ మిశ్రా అధ్యక్షతన ఇతర స్టాండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారన్నారు. ఈ సమావేశంలో నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని మజ్దూర్ యూనియన్ ప్రతినిధులు కోరినట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦సామూహిక అక్షరాభ్యాసం

ఓదెల: మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో ప్రిన్సిపాల్ గజబీంకార్ మౌనిక ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ బోడకుంట రాజేశం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

✦నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని గౌతమినగర్, జనగాం, అల్లూరు విద్యుత్ ఉపకేంద్రాల్లో 33కేవీ లైన్‌లో శనివారం ఉదయం 7.30 నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్పీడీసీఎల్ గోదావరిఖని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు.

✦రామగుండం సబ్‌స్టేషన్‌లో..

రామగుండం: రామగుండం సబ్‌స్టేషన్‌లో పునరుద్ధరణ పనుల నిమిత్తం దాని పరిధిలో ఉన్న ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బేతి దామోదర్‌రావు తెలిపారు. మల్యాలపల్లి, బద్రిపల్లి, మొగల్‌పహాడ్, కుందనపల్లి, అక్బర్‌నగర్, రైల్వేస్టేషన్ ఏరియా, విద్యుత్‌నగర్, అయోధ్యనగర్, జీరో పాయింట్, హౌజింగ్‌బోర్డు కాలనీ, లింగాపూర్, అబాది రామగుండం, సండే మార్కెట్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

✦అల్లూరు సబ్‌స్టేషన్‌లో..

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ అల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతు, 33 కేవీ లైన్‌లో పనుల దృష్ట్యా అల్లూరు సబ్ స్టేషన్ పరిధి సంతోష్ నగర్, హనుమాన్‌నగర్, కేకే నగర్, లంబడి తండా తారకరామానగర్, అల్లూరు, న్యూమారేడుపాక తదితర ఏరియాల్లో ఉదయం 7.30 నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

✦బియ్యం అందజేత

కమాన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన కిరణ్‌గౌడ్ కొన్నిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అలాగే నూతి కృష్ణమూర్తి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వెంకటస్వామి ఒక్కో కుటుంబానికి 25కిలోల బియ్యం అందజేశారు.

కృత్రిమ గర్భధారణతో మేలు జాతి పశువులు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: పంటల సాగుకు అవసరమైన మేలు జాతి పశువులను కృత్రిమ గర్భధారణతో పొందవచ్చని పశుగణాభివృద్ధి సంస్థ ఈవో శ్రీధర్ అన్నారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం కృత్రిమ గర్భధారణపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. పల్లె ప్రాంతాల్లోని పాడిరైతులకు గోపాలమిత్రలు ద్వారా ఆవు, గేదెలకు కృత్రిమ గర్భధారణ చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీ రవీందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రావు, వైద్యులు కమలాకర్, సూపర్‌వైజర్లు జానీ, రాఘవ, గోపాలమిత్రలు కల్వల శ్రీనివాస్, రవీందర్, చంద్రయ్య, కుమార్, సమ్మయ్య, తిరుపతి, సురేశ్ పాల్గొన్నారు.